పులివెందుల జడ్పీటీసీ గెలవబోతున్నాం

- రాజారెడ్డి రాజ్యాంగానికి చరమగీతం పలికారు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత చిత్రంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి తదితరులు

పులివెందుల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ గెలవబోతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం సాయంత్రం 6గంటల ప్రాంతంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పులివెందుల ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. 30, 40 సంవత్సరాల్లో ఇలాంటి స్వేచ్ఛాయుత ఎన్నికలు చూడలేదని ప్రజలే అంటున్నారన్నారు. ఇప్పటి వరకు పులివెందులలో రాజారెడ్డి రాజ్యాంగం సాగిందన్నారు. ఈ ఎన్నికతో పులివెందుల వాసులు రాజారెడ్డి రాజ్యాంగానికి చరమగీతం పాడారన్నారు. గత ఏడాదిపాలనలో ప్రజలకు టీడీపీ చేసిన అభివృద్ధితో ఎన్నికల్లో గెలుస్తున్నామన్నారు. వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడి నిందలు మాత్రం టీడీపీ వారిపై వేస్తున్నారన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి పులివెందుల డీఎస్పీ మురళినాయక్‌ను ఏ విధంగా దూషించారో అందరూ చూశారన్నారు. ఈ ఎన్నికల్లో జగన్, భారతిలు అనేకమందికి వాట్సాప్ కాల్ చేసి ఓటు వేయాలని బెదిరించారన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ సాగితే గెలవలేమని ఎంపీ అవినాశ్‌రెడ్డికి తెలిసిపోయిందన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలు నిర్వహించిందో అందరూ చూశారన్నారు. అరాచకాలకు పెట్టింది పేరుగా వైసీపీ ముందుకు సాగిందన్నారు.

అనంతరం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ మొన్నటి వరకు రాష్ట్రంలోను, పులివెందులలోను షేమ్ డెమోక్రసీ (అవమానకరం).. నేడు సేవ్ డెమోక్రసీ సాగుతోందన్నారు. వైసీపీ పాలనంతా మోసాలకు అక్రమాలకు పెట్టింది పేరుగా మారిందన్నారు. ఎన్‌డీఏ కూటమి ప్రజలకు మేలు చేస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో తాము చేసిన వాగ్దానాలు వందరోజుల్లో అమలు చేసి తీరుతామన్నారు. అలాగే ఎర్రబల్లె చెరువుకు నీటితరలింపు జీఓను తీసుకొస్తామన్నారు. అనంతరం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేశారని, అదీ కూటమి అభ్యర్థికే వేశారని అన్నారు. పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైసీపీ అనేక అక్రమాలకు పాల్పడిందన్నారు. చివరకు న్యాయస్థానానికి వెళ్లి ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నించారన్నారు. అయినా న్యాయస్థానంలో ఎలాంటి అవకాశం దొరకలేదన్నారు. అవినాశ్‌రెడ్డిని ఉదయం అరెస్టుచేసి మధ్యాహ్నం వదిలేశారన్నారు. కానీ మా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని ఉదయం నుంచి సాయంత్రం వరకు అరెస్టు చేశారన్నారు. అంటే పోలీసులు ఎవరికి వ్యతిరేకమో, ఎవరికి అనుకూలమో అర్థమవుతోందన్నారు. పులివెందుల జడ్పీటీసీగా లతారెడ్డి గెలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్

- 76.44శాతం ఓటింగ్ నమోదు
- ఏజెంట్ల విషయంలో రెండుచోట్ల చిన్నపాటి ఘర్షణ
- పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన సమస్య



వృద్ధుడిని కేంద్రం వద్దకు తీసు కొస్తున్న సిబ్బంది



నల్లపురెడ్డిపల్లె పోలింగ్ బూత్ వద్ద టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి



పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్



పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులకు సూచనలిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్



గుమిగూడిన జనాన్ని పంపించివేస్తున్న పోలీసులు



పోలింగ్ కేంద్రం వద్ద తనిఖీలు చేస్తున్న దృశ్యం



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు



ఓటువేశామని చూపుతున్న మహిళ

కడప/ పులివెందుల/ పులివెందుల రూరల్/ వేంపల్లె/ సింహాద్రిపురం/ లింగాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7గంటల నుంచి ప్రారంభమైన ఉప ఎన్నికల ఓటింగ్ ఒకటి రెండు చిన్నచిన్న సంఘటనలు మినహా అంతా ప్రశాంతంగా సాగింది. మండలంలోని 15 పోలింగ్ స్టేషన్లలో ఉదయం 7గంటలకు ఓటింగ్‌ను ప్రారంభించారు. ఈ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించారు. ఆరు పంచాయతీల్లో ఈ ఎన్నికలు జరిగాయి.

పంచాయతీల వారీగా..

పులివెందుల జడ్పీటీసీ స్థానానికి ఆరు పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. యర్రబల్లె పంచాయతీలో యర్రబల్లె, నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లెలో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడు పోలింగ్ కేంద్రాలు ఒకేచోట ఉండడంతో ఓటర్ల రద్దీ కనిపించింది. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌ను ఓటర్లు ఉపయోగించుకున్నారు. హెల్ప్‌డెస్క్‌లో తీసుకున్న సమాచారం మేరకు ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓట్లు వేశారు. ఇ.కొత్తపల్లెలో ఉదయం ఓటింగ్ ప్రారంభమైన సమయంలో ఏజెంట్ల విషయమై కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేయడంతో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. అచ్చవెల్లి, ఎర్రిపల్లె పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటలకే ఎన్నికలు ప్రారంభమై ప్రశాంతంగా సాగింది.

ఓటు వేయని వైసీపీ అభ్యర్థి

ఆర్.తుమ్మలపల్లెలో ఏర్పాటుచేసిన రెండు పోలింగ్ కేంద్రాలలో 77శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ గ్రామంలో వైసీపీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి రాలేదు. ఎర్రిపల్లె పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఓటు విషయమై చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. ఓ వాహనానికి అద్దాలు ధ్వంసం చేశారు. దీనిని గమనించిన పోలీసులు వెంటనే పరిస్థితిని చక్కదిద్దారు. ఎర్రిపల్లెలో 636 ఓట్లకు గాను 508 ఓట్లు పోలయ్యాయి. అచ్చవెల్లిలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా ఓటర్లు ఓట్లు వేశారు. కనంపల్లెలో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. కొందరు మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్‌కేంద్రానికి వచ్చి ఆందోళనకు దిగారు. మీ ఓటు మీరు వేసి వెళ్లండని పోలీసులు చెప్పడంతో వారు వెళ్లిపోయారు. భారీ భద్రత మధ్య సాగిన ఈ ఉప ఎన్నికలు ఒకటి రెండు చిన్నచిన్న సంఘటనలు మినహా ప్రశాంతంగా సాగాయి.

కలెక్టర్, ఎస్పీ, డీఐజీ పర్యవేక్షణలో..

జడ్పీటీసీ ఉప ఎన్నికలు జిల్లాలో ఒంటిమిట్ట, పులివెందులలో మాత్రమే జరిగాయి. దీంతో ఈ ఎన్నికలను జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా తీసుకుంది. ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తూ ఓటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించింది. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలింగ్ కేంద్రాలను అనుక్షణం పర్యవేక్షించారు. కలెక్టర్ నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె, యర్రబల్లె తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎస్పీ, డీఐజీలు 15 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమీక్షిస్తూ ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నారు.

ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్న పోలీసులు..

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా వైసీపీ, టీడీపీల మధ్య హోరాహోరీ పోరు సాగుతుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం తెల్లవారుజామున 6 గంటల ప్రాంతంలో ఎంపీ అవినాశ్‌రెడ్డిని డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో హౌస్ అరెస్టు చేసి తర్వాత పులివెందుల నియోజకవర్గం నుంచి బయటి ప్రాంతాలకు తరలించారు. అలాగే ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని 6.30గంటల ప్రాంతంలో పోలీసులు హౌస్ అరెస్టు చేసి అక్కడి నుంచి ఆర్కే వ్యాలీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో అవినాశ్‌రెడ్డి మళ్లీ పులివెందులకు చేరుకుని పార్టీ ఆఫీస్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ మురళీనాయక్ వైసీపీ కార్యాలయానికి వెళ్లి ఓటింగ్ పూర్తయ్యేవరకు బయటకు రావద్దని ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకుల నుంచి పోలీసులకు కొంత ప్రతిఘటన ఎదురైంది. పోలీసులు వారిని మందలించారు.



ఓటు వేసేందుకు చంటిబిడ్డలతో వెళ్తున్న ఓటర్లు



ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు ● ఎంపీ అవినాశ్‌రెడ్డి



పులివెందుల/పులివెందుల రూరల్/ ఎర్రగుంట్ల / జమ్మలమడుగు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలు చెత్త ఎన్నికలని ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేశారని కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 6గంటలకు ఆయన పులివెందులలో విలేకరులతో మాట్లాడారు. యథేచ్ఛగా రిగ్గింగ్ చేశారు, దొంగోట్లు వేసుకున్నారన్నారు. మా ఓటు మేము వేసుకుంటామని కాళ్లు పట్టుకొని వేడుకున్నా పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం ఇక్కడుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో, బయట వెబ్‌క్యాస్టింగ్ చేశారన్నారు. ఈ వెబ్‌క్యాస్టింగ్‌లో రెండు విషయాలు గమనిస్తే పది మంది జమ్మలమడుగుకు చెందిన వారు, మరోపది మంది కమలాపురానికి చెందిన వారుగా గుర్తించామన్నారు. బీహార్‌లో కూడా ఇలాంటి ఎన్నికలు చూసి ఉండమన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఇక్కడి వివరాలను ఇస్తామన్నారు. అలాగే న్యాయస్థానం ఆశ్రయించి పోరాటం చేస్తామన్నారు. అధికార పార్టీ అండదండలతో పోలీసులు ఈ ఎన్నికలు ముగించారన్నారు.

ఎర్రగుంట్లలో రాస్తారోకో

మంగళవారం వైసీపీ నేతలు ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో రాస్తారోకో చేశారు. ఎంపీ అవినాశ్‌రెడ్డిని పులివెందుల నుంచి ఎర్రగుంట్ల మీదుగా పోలీసులు తీసుకెళుతున్నారనే సమాచాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆయన అనుచరులు ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద పోలీసుల వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు అవినాశ్‌రెడ్డిని నిడిజువ్విలోని సుధీర్‌రెడ్డి ఇంట్లో హౌస్ అరెస్టు చేశారు. అనంతరం వీరందరూ కలసి ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ బైఠాయించి రాస్తారోకో చేశారు. ప్రొద్దుటూరు డీఎస్పీ భావన ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. కూటమి ప్రభుత్వానికి పులివెందుల ఎన్నికలతో పతనం ప్రారంభమైందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. మంగళవారం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

కమాండ్ కంట్రోల్ నుంచి భద్రత పర్యవేక్షణ



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

పులివెందుల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా పోలింగ్ ప్రక్రియపై అత్యాధునిక డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు. పులివెందుల కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పోలీసులకు డీఐజీ కోయప్రవీణ్, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ సూచనలు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసిన అత్యాధునిక డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా ఏకకాలంలో ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పులివెందుల జడ్పీటీసీ స్థానంలో తుమ్మలపల్లె, నల్లపురెడ్డిపల్లె.. ఒంటిమిట్ట జడ్పీటీసీ పరిధిలో కొత్తమాధవరం, ఒంటిమిట్టలో పోలింగ్ సరళిని పరిశీలించారు. విజువల్స్‌ను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఒంటిమిట్టలో 24, పులివెందులలో 15 అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.



నల్లపురెడ్డిపల్లె పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసేందుకు వెళ్తున్న ఓటర్లు

మెగా డీఎస్సీ ఫలితాలు విడుదల

- పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో వివరాలు
- టెట్ మార్కులు సరిచూసుకునేందుకు రెండురోజులు గడువు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఫలితాలు వెల్లడయ్యాయి. ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకానికి పరీక్షలు నిర్వహించగా, అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సవరించిన తుది కీ ఆధారంగా నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా రూపొందించిన తుది ఫలితాలను డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి సోమవారం రాత్రి విడుదల చేశారు. అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తుది ఫలితాలు, స్కోర్ కార్డులను పొందవచ్చని వెల్లడించారు. టెట్ వివరాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ నెంబర్ ద్వారా తమకు తామే ఈనెల 13వ తేదీలోగా సరిచేసుకోవడానికి అవకాశాన్ని కల్పించారు.

పరీక్షలు ఇలా

జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలకు సంబంధించి జూన్ 6వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లాస్థాయిలో 712 పోస్టులకు (రాష్ట్ర, జోనల్ స్థాయి పోస్టులు వీటికి అదనం) నోటిఫికేషన్ విడుదలైంది. అయితే జిల్లాస్థాయి పోస్టులకు మొత్తం 15,812 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 9,598 మంది మహిళలు, 6,214 మంది పురుషులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు చాలా మంది ఒకటికి మించి దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పరీక్షలు కడప నగరంలో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించారు.

ఆరేళ్ల తర్వాత ప్రకటన

గతంలో (2014, 2018) టీడీపీ ప్రభుత్వం పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు డీఎస్సీ ఊసే ఎత్తలేదు. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. అయినా గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం ఒక్క ఉపాధ్యాయుడినీ నియమించలేదు. సర్దుబాటు పేరుతో ఉన్న వారితో కుర్చీలాట ఆడారు. పలు పాఠశాలల్లో ఏకోపాధ్యాయ బోధనే దిక్కయింది. ఎన్నికల లబ్ధి కోసం గతేడాది చివర్లో హడావుడిగా డీఎస్సీ ప్రకటించింది. ఎన్నికల ప్రకటన రావడంతో ఆ డీఎస్సీ ఊసే లేకుండా పోయింది. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తొలిరోజే డీఎస్సీ ఫైలుపై సంతకం చేశారు.

జిల్లాలో పోస్టుల వివరాలు

ఉమ్మడి కడప జిల్లా ప్రాతిపదికన జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, పురపాలక (జిల్లాస్థాయి) విభాగంలో 705 పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం (జిల్లాస్థాయి) విభాగంలో 4 పోస్టులు, జువైనల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 3 పోస్టులు మొత్తంగా జిల్లాస్థాయిలో 712 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. వీటిలో ఫస్ట్ లాంగ్వేజ్ 34, హిందీ 18, ఇంగ్లిష్ 81, గణితం 44, ఫిజికల్ సైన్స్ 30, బయలాజికల్ సైన్స్ 53, సోషల్ 65, ఫిజికల్ ఎడ్యుకేషన్ 82, సెకండరీ గ్రేడ్ టీచర్ 298 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చూపారు. అలాగే ట్రైబల్ వెల్ఫేర్‌కి సంబంధించి గణితం 1, ఫిజికల్ సైన్స్ 1, బయలాజికల్ సైన్స్ 1, ఎస్‌జీటీ 1, అలాగే జువైనల్ వెల్ఫేర్‌కు సంబంధించి ఎస్జీటీ 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ఫలితాలను ప్రకటన చేయడం పట్ల అటు నిరుద్యోగులు, ఇటు ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కడప జిల్లాలోని చాలా వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అయ్యాయి. కొన్ని పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులను ఒకే ఉపాధ్యాయుడు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసరంగా ఉపాధ్యాయులు సెలవు పెడితే ఆ రోజు పాఠశాలకు తాళం వేయాల్సిందే. ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం నియామక ప్రక్రియను నిర్వహించనుంది.

ఎర్రచందనం అక్రమ రవాణా భగ్నం

- 68 దుంగలు స్వాధీనం.. ఏడుగురు నిందితుల అరెస్టు



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, నిందితులతో అటవీ అధికారులు

కడప ఎన్జీఆర్ సర్కిల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖాధికారులు మరోసారి ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఈ మేరకు జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్‌కు మంగళవారం కడపలోని అటవీ శాఖ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమకు అందిన ముందస్తు సమాచారంతో కడప ఫారెస్టురేంజ్ ఆఫీసరు ప్రసాద్, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. మద్దిమడుగు ఈస్ట్‌బీట్ పరిధిలోని పాలకొండ రిజర్వు ఫారెస్టు నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో తమ సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున సుమారు ఒంటిగంట సమయంలో సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు. మట్టివంక ప్రాంతంలో కడప-బెంగళూరు నేషనల్ హైవే సమీపంలో భారత్ బెంజ్ లారీ, మహీంద్ర, టయోటా వాహనాలలో ఎర్రచందనం అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకుని ఏడుగురు నిందితులను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 1078 కిలోలు బరువున్న 68 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఇవి రూ.3,14,485 విలువ చేస్తాయన్నారు. నిందితులు పాలకొండ రిజర్వు ఫారెస్టు నుంచి ఎర్రచందనం చెట్లను నరికివేసి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అంగీకరించారన్నారు. ఈ ఆపరేషన్‌లో మామిళ్లపల్లె సెక్షన్ డీఆర్వో ఓబులేసు, మద్దిమడుగు సెక్షన్ ఎఫ్ఎస్‌వో షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారన్నారు.

నిందితులు వీరే..

చమర్తి అమరేంద్రరాజు, దాసరి నరేంద్ర (వీరబల్లె), మల్లికార్జున నాయక్ (సీకేదిన్నె), కార్తీక్ (చెన్నై), మిట్ట మాధవరెడ్డి (చెన్నూరు), గురు నాథ్‌సింగ్ (పంజాబ్), అబ్దుల్ హఫీజ్(మధ్య ప్రదేశ్) పట్టుబడ్డారని అటవీ అధికారి తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు మరింత నిఘా పెంచనున్నట్లు ఆయన వివరించారు.

మళ్లీ మొదటికే బొప్పాయి ధరలు

- చెక్‌పోస్టుల్లో ఉద్యాన, మార్కెటింగ్ శాఖల సిబ్బంది తనిఖీ
- టన్ను కాయలను రూ.7వేలకు తగ్గించారంటూ ఆవేదన



చెక్‌పోస్టు వద్ద లారీలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రైల్వేకోడూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలు మళ్లీ మొదటికి వచ్చాయి. మంగళవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌కు బొప్పాయి రైతులు టన్ను కాయలను దళారులు రూ.7 వేలు చేశారని ఆవేదన చెందారు. బొప్పాయి రైతులు అందించిన సమాచారం మేరకు.... సీజన్ ప్రారంభంలో టన్ను కాయలు రూ.16 వేలు, తర్వాత టన్ను రూ.15 వేలు, రూ.14 వేలు, రూ.13వేలు, రూ.10వేలు ధరలు పలికాయి. ఉన్నపళంగా దళారులు టన్ను కాయలను రూ.7వేలు చేయడంతో గతంలో రైతులు భారీ ఎత్తున ఆందోళన చేశారు. వరిగడ్డిని కాల్చి బొప్పాయి లారీలను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫోన్ ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. రైల్వేకోడూరులోని ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో రైతులు, మార్వాడీలు, దళారులతో కలిసి సమావేశం నిర్వహించారు. అయితే టన్ను కాయలను రూ.9 వేలకు తక్కువ లేకుండా చేయాలని కలెక్టర్ ప్రకటించారు. దీనికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. వ్యాపారం పెరిగే కొద్దీ ధరలు పెరుగుతూ ఉంటాయని తెలిపారు. ఈ నెల 1వ తేది నుంచి టన్ను కాయలను రూ.10 వేలు చేయాలని ఆదేశించారు. టన్ను 9 వేలు కాకుండా టన్ను రూ.8 వేలు చేశారని మళ్లీ రైతులు ఆందోళనకు దిగారు. రాజంపేటకు కొత్తగా వచ్చిన సబ్ కలెక్టర్ భావన ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ధరల విషయంలో ఒక కొలిక్కి రాకపోవడంతో మళ్లీ సబ్ కలెక్టర్ రైల్వేకోడూరుకు రావాల్సి వచ్చింది. సమావేశం నిర్వహించి బొప్పాయి కాయలను టన్ను రూ.9 వేలకు ఎవరూ తగ్గించే ప్రసక్తి ఉండకూడదని దళారులకు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను ఎవరైనా పాటించకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ బొప్పాయి దళారులు టన్ను రూ.9 వేలు కాకుండా ఏకంగా ప్రస్తుతం టన్ను రూ.7 వేలు చేశారని రైతులు మళ్లీ ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారులకు విన్నవించుకున్నారు. ఇదిలా ఉండగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కలిసి నియోజకవర్గంలోని చెక్‌పోస్టుల వద్ద లారీల తనిఖీలు చేపట్టారు. ఎవరైతే టన్ను కాయలను తక్కువగా కోతలు చేసి లోడింగ్ వేసుకుని వెళతారో వాటిని ఆపి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు తహసీల్దార్ అమర్‌నాథ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని దళారులు అందరూ టన్ను బొప్పాయి కాయలను రూ.9 వేలకు తగ్గించి రైతులను మోసం చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.



తహసీల్దార్ అమర్‌నాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న బొప్పాయి రైతులు

వివాహిత అనుమానాస్పద మృతి



మృతిచెందిన రత్నమ్మ

నిమ్మనపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలో చోటుచేసుకొంది. ఏఎస్ఐ జిలానీబాషా వివరాల మేరకు కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారి పల్లికు చెందిన బాల్లాపురం జ్యోతిశేఖర్ భార్య మలిశెట్టి రత్నమ్మ(26) అనుమానాస్పదంగా మృతి చెందింది. మలిశెట్టి రత్నమ్మది బి.కొత్తకోట మండలం కాగా ఐదేళ్ల క్రితం జ్యోతిశేఖర్‌ను ప్రేమ వివాహం చేసుకొన్నారు. వీరి ఇద్దరికీ రెండేళ్ల మునిష్కరనందన్ అనే కుమారుడు వున్నాడు. అయితే భర్త జ్యోతిశేఖర్ ప్రతి రోజు పెయింటంగ్ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి రాగానే రత్నమ్మ ఇంటిలో అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. రత్నమ్మ మృతిపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు అయన తెలిపారు.

ఏపీఎం రజనీకుమారిపై దాడి

- ఆరుగురిపై కేసు నమోదు



బ్యాంక్ వద్ద వాగ్వాదం చేసుకుంటున్న ఏపీఎం, మహిళలు

గుర్రంకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ సంఘమిత్ర-3 నాగరాజమ్మ తొలగింపు విషయమై మహిళలు ఏపీఎం రజనీకుమారి తో గొడవపడి దాడి చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ దాడికి సంబంధించి ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ తల్లారివాండ్లపల్లెకు చెందిన నాగరాజమ్మ సంఘమిత్రగా పనిచేస్తుండేది. ఈ నేపథ్యంలో ఆమెపై ఆరోపణలు రావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి ఆమెకు సంఘమిత్ర విధులు చెప్పలేదు. ఈ నేపథ్యంలో నాగరాజమ్మ సంఘమిత్ర పరిధిలోని గ్రూప్ సభ్యులతో కలిసి మొదట వెలుగు కార్యాలయానికి చేరుకున్నారు. ఏపీఎం రజనీకుమారి లేకపోవడంతో సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వద్దకు చేరుకొని ఏపీఎంతో మహిళలు వాగ్వాదం చేశారు. ఏపీఎంపై మహిళలు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దాడి చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో తనపై దాడి చేసిన నాగరాజమ్మ, భారతి, లక్ష్మీదేవి, రమణమ్మ, శేఖర్, గంగిరెడ్డిలపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

కలికిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఏడాది పదవీ కాలంతో ఈ పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. కమిటీ గౌరవాధ్యక్షుడుగా స్థానిక ఎమ్మెల్యే హోదాలో మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, అధ్యక్షుడుగా ఎస్.ఎం.డి. షఫీ నాయక్, ఉపాధ్యక్షుడుగా సి.మల్లికార్జున, డైరెక్టర్లుగా కొర్లకుంట కృష్ణ, సోమవరపు కొండయ్య, మండెం సుజాత, బుక్కే కృష్ణా నాయక్, షేక్ మహ్మద్ రఫీ, బాలే కృష్ణమ్మ, మురికినాటి విజయలక్ష్మి, చీకటి హరి ప్రసాద్, గుగ్గిలం మల్లికార్జున, ఆవుల వేదవతి, పురం రామాంజనేయులు, పందికుంట విజయలక్ష్మి, టి.సాలమ్మలతోపాటు రామాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు, లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ శాఖ ఏడీ, లక్కిరెడ్డిపల్లె సర్పంచు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని కూడా నామినేటెడ్ సభ్యులుగా నియమించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.


రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి



విజయవాడలో ఉన్నత విద్యాశాఖ జేడీకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి జేఏసీ నేతలు

మదనపల్లెటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని విద్యార్థి జేఏసీ నేతలు ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ కృష్ణకు విన్నవించారు. మంగళవారం విజయవాడలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో జేడీని కలిసిన విద్యార్థి జేఏసీ నేతలు మాట్లాడుతూ బీసెంట్ ట్రస్టు నుంచి అనెగ్జర్-1 ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని, అప్పట్లో స్వాధీనం చేసుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఖర్చులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలన్నారు. యూజీసీ విధానాల ప్రకారం అధ్యాపకుల విద్యార్హతపై నిర్వహించిన విచారణ అనంతరం వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు, ఖర్చుల వివరాలు బహిర్గతం చేయాలన్నారు. కళాశాలలో పనిచేస్తున్న అనర్హులను తొలగించి, అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఉత్తన్న, టి.రాజా, సురేష్, శ్రావణ్, సుధీర్, శివ పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు దూరంగా వుండటంతో పాటు మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు దగ్గర కాకపోవడం జీవితంలో పెద్ద విజయమని బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. డ్రగ్స్‌పై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. తాత్కాలిక తృప్తి కోసం జీవితాలు నాశనం చేసుకోవద్దని, బలహీన క్షణాలను అధిగమిస్తే జీవితం సుఖమయం అవుతుందని వివరించారు. సీఐతో పాటు విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా... వృద్ధురాలు మృతి

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనచెరువు గ్రామం, టేకులపాలెంకు చెందిన పాపమ్మ(60) రైతుభరోసా డబ్బులు పడలేదని సచివాలయం వద్దకు ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యంలో లాభాల గంగమ్మ ఆలయం సమీపంలో ఆటో బోల్తా పడింది. గాయపడిన వృద్ధురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈమెకు ముగ్గురు కుమారైలు ఉన్నారు.

స్వాతంత్ర్య వేడుకలను పండుగలా నిర్వహించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

సంబేపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఈ నెల 15న జరిగే 79వ భారత స్వాతంత్ర్య వేడుకలను పండుగ వాతావరణంలో కన్నుల పండుగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో స్వాతంత్ర్య వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకల్లో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, వేదికను అందంగా అలంకరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులకు వేడుకలకు ప్రత్యేకంగా వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రొటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు అందరికీ పంపించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో షామియానా, కుర్చీలు, బారికేడింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు సూచించారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, ఏఎస్పీ వెంకటరత్నం, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

- జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్



క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్

రైల్వేకోడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ రైతులకు లాభదాయకమని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ బి.వెంకట మోహన్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలం బొజ్జావారిపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందితో సమావేశం నిర్వహించి రైతులు క్షేత్ర స్థాయిలో పండిస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ గ్రామంలో ప్రకృతి పరంగా లభించే వేపాకులు, పశువుల ఎరువు తదితర వాటిని సేకరించుకుని పంటలకు వేస్తే అత్యధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. దీంతో భూసారం కూడా పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఇన్‌పేషంట్ల వార్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు

తంబళ్లపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మదనపల్లె సబ్‌కలెక్టరు కళ్యాణి అన్నారు. మంగళవారం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని బాలింతల వార్డు, ఇన్‌పేషంట్ల వార్డు, ఇంజక్షన్ల వార్డు, ఓపీ తదితర విభాగాలను సందర్శించారు. ఆసుపత్రికి రోజూ వచ్చే ఓపీల సంఖ్య, ఇన్ పేషంట్ల వివరాలు, మందుల స్టాకు, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు తదితర వివరాలను వైద్యుడు అమర సింహ రాజును అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత వేదిస్తోందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర సబ్ కలెక్టరు దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యను పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టరు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో థామస్ రాజ, డీటీ నవీన్, ఎంఈవో త్యాగరాజు, ఆర్ఐ ముద్దుకృష్ణ, హెడ్‌నర్సు గ్లోరి, వీఆర్వో నాగరాజ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పీజీఆర్ఎస్ వినతులను పరిష్కరించాలి

ములకలచెరువు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ వినతులను త్వరగా పరిష్కరిం చాలని మదనపల్లె సబ్ కలెక్టర్ కళ్యాణి ఆదేశించారు. ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్ వినతుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని, పెండింగ్‌లో ఉన్న వినతులను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వీఆర్‌వోలతో సమావేశమై రెవెన్యూ సమస్యల గురించి ఆరా తీశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ ప్రదీప్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రియాజ్‌బేగ్

సంబేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ గుళిక తప్పనిసరిగా తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంవో రియాజ్‌బేగ్ తెలియజేశారు. మంగళవారం జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సమవేశం ఏర్పాటు చేశారు. 1 నుంచి 19 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికీ నులిపురుగులను నివారించాలంటే గుళిక తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి మాత్రలు అందేలా చూడాలని అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఐసీడీఎస్ సిబ్బందికి తెలియజేశారు. భోజనానికి ముందు ప్రతిఒక్క విద్యార్థి చేతులు శుభ్రం చేసుకోవాలని తెలియజేశారు. రాయచోటి డైట్ కళాశాలలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్‌లు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఆశావర్కర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘టీ తాగుదాం’ కార్యక్రమం



మాట్లాడుతున్న ఏపీజీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్

రాయచోటిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యో తి): ‘టీ తాగుతూ చర్చించుకుం దాం’ కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఏ) జి ల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ అరియర్స్, డీఏలను పట్టించుకోలేదని, మూడేళ్లుగా సరెండర్ లీవ్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వాలు అవసరం లేదంటూ మనమంతా కలిసి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడినా ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే సుమారు 25 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం బకాయి పడిందన్నారు. రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమ స్యలను తెలుసుకుని జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో రిటైరైన ఉద్యోగులకు ఇంతవరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక పోవడంతో వారు వివాహాది కార్యక్రమాలు చేసుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఈ విషయాలను ప్రభుత్వం గుర్తించి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాఖ రాష్ట్ర మహిళా కార్యదర్శి హైమావతి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. కరీమ్, ఏపీజీఏ రాయచోటి తాలూకా అధ్యక్షుడు ఓ. సాయికుమార్, వాణిజ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళ వారం రాష్ట్ర అదనపు సంచాలకుడు డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మదనపల్లె అర్బన్ పరిధిలోని అమ్మచెరువు మిట్ట యుపీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దస్త్రాలను పరిశీలించి వివరాలను మెడికల్ ఆఫీసర్‌ను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మాతా శిశువు సంరక్షణ సంబంధించిన మందులు ఉన్నాయా, సీజనల్ వ్యాధుల పట్ల అవ గాహన కల్పించారు. రోజూ ఓపీకి వచ్చే రోగులకు ఈహెచ్‌ఆర్ తప్పక చేయాల న్నారు. అర్హులైన దంపతులకు కుటుంబ సంక్షేమంలో భాగంగా బిడ్డకు బిడ్డకు మధ్య సమయం ఉండేలా ప్రోత్సహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుజిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్, 104 జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, అమ్మచెరువు మిట్ట యూపీహెచ్‌సీ డాక్టర్ భార్గవి, హరికృష్ణ, ప్రసాద్, మహహ్మద్ రఫీ పాల్గొన్నారు.

బోర్ల వద్ద కేబుల్ వైర్లు చోరీ



వైర్లను చూపుతున్న రైతు

గుర్రంకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు గ్రామంలోని దిగువపల్లె వద్ద రైతుల పొలాల్లో బోర్లకు అమర్చిన కేబుల్ వైర్లను దుండగులు చోరీ చేశారు. గ్రామా నికి చెందిన 18 మంది రైతుల బోర్ల వద్ద ఉన్న కేబుల్, స్టార్టర్‌లను దుండగులు కోసుకెళ్లి నట్లు రైతులు చెబుతున్నారు. కేబుల్ వైర్లు కత్తిరించడంతో రైతులు పొలాలకు నీరు అందిం చడానికి పడరాని పాట్లు పడుతున్నారు. అధికా రులు స్పందించి దుండగులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బయ్యారెడ్డి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను విడదీశారని మనస్తాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లెకు చెందిన కొండారెడ్డి, సావిత్రమ్మ దంపతుల కుమారుడు బయ్యారెడ్డి (21) ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొండామరిపల్లెకు చెందిన ఓ యువతిని కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఇరువురు మేజర్లు కావడంతో విషయం వారి కుటుంబ సభ్యులకు తెలిపి వివాహం చేయాలని కోరారు. కాగా పెద్దలు అంగీకరించకపోవడంతో ఇంటి నుంచి వెళ్లి గురువారం కాణిపాకంలో వివాహం చేసుకున్నట్లు బాధితుడు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం తాలుకా సీఐ కళా వెంకటరమణ తనకు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని ఆదేశించారన్నారు. ఇరువురు తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారన్నారు. అనంతరం సీఐ తమతో మాట్లాడుతూ యువతికి ఏడాదిలో చదువు పూర్తవుతుందని, అనం తరం పెద్దల సమక్షంలో పెళ్లి జరిపిస్తామని చెప్పి బలవంతంగా యువతిని ఆమె తల్లిదండ్రులతో సీఐ పంపి వేశారని బాధితుడు ఆరోపించారు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన బయ్యారెడ్డి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణం, నీరుగట్టువారిపల్లె మారుతీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు వెంకటేశ్ భార్య కృష్ణమ్మ(44) సోమవారం కుటుంబ కలహాలతో రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

ఆక్రమిత భూముల స్వాధీనం

రాజంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దారు పీర్‌మున్నీ ఒక ప్రకటనలో తెలిపారు. మందపల్లె గ్రామం సర్వే నంబరు 534లో కె.నరసయ్య 2.27 ఎకరాల భూమిని, కె.ఉమా 1.60 ఎకరాల భూమిని ఆక్రమించి సిమెంటు స్తంభాలు నాటగా వాటిని తొలగించామన్నారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మన్నూరు పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



ప్రభుత్వ భూమిలో తొలగించిన సిమెంటు స్తంభాలు

గండికోట నుంచి 7500 క్యూసెక్కుల నీరు విడుదల



మైలవరానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటిని విడుదల చేశామన్నారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 12,500 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు. ఎగువప్రాంతాల్లో, వర్షం వల్ల వాగులు, వంకల ద్వారా 2500 క్యూసెక్కుల వర్షపునీరు వచ్చి చేరుతోందన్నారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 10,000 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం పైడిపాలెం రిజర్వాయిర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.380 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ



వెల్లాల బ్రిడ్జిపై కంపవేసి రాకపోకలు నిలిపివేసిన దృశ్యం



రాజుపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం దాదాపు 25వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కుందూకు వక్కిలేరు నీళ్ల జత కావడంతో టంగుటూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తుంది. నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు పడు తుండడంతో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలి పారు. కాగా, వెల్లాల వద్ద బ్రిడ్జిపై నీళ్ల ప్రవహిస్తుండటంతో అక్కడ రాకపోకలను రెవెన్యూ అధికారులు కంప వేసి నిలిపివేశారు. గోపల్లె గ్రామాలకు వెళ్లే ప్రజలు ఎగువ ఉన్న కొత్త బ్రిడ్జిపై వెళ్లాలని సూచించారు. ఈ రాత్రికి వర్షం పడితే కుందూ మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది.

పెన్నాలో కొనసాగుతున్న వరద ఉధృతి

జమ్మలమడుగు వద్ద ప్రవహిస్తున్న వరదనీరు



జమ్మలమడుగు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత 10 రోజుల నుంచి వరద నీటితో పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెన్నానదిలోకి ఎవరు వెళ్లరాదని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే మంగళవారం రాత్రికి పెన్నానదికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, పెన్నానదిలో నీటి ప్రవాహంతో మైలవరం మండలంలోని వేపరాల గ్రామ శివార్లలో గనులకు వెళ్లే సిమెంటు రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. ఇక నదిలో సుమారు రెండు మూడు చోట్ల కోతకు గురైందని తెలుస్తోంది.

రెండు జడ్పీటీసీలను గెలుస్తాం...

- చంద్రబాబు సాగిస్తున్న అభివృద్ధి-సంక్షేమంతోనే విజయం
- వైసీపీ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప మారుతీనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలలో ప్రజల ఆదరాభిమానాలతో రెండింటిలో గెలుపు ఖాయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సంధ్య సర్కిల్ సమీప మానస ఇన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఉప ఎన్నికలలో ఓటర్లు టీడీపీ అభ్యర్థులకు పట్టం కట్టారని జోష్యం చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 14 నెలల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్-6 పథకాలను ఒక్కొక్కటిగా దిగ్విజయంగా ప్రజలకు అందజేస్తున్న నేపథ్యంలో ప్రజలు సైతం కూటమి పాలనకు జై కొట్టారన్నారు. ఒంటిమిట్టలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికలో తాను రౌడీయిజం చేసినట్లుగా కొంతమంది వైసీపీ నాయకులు ఆరోపించడం విడ్డూరంగా వుందన్నారు. వైసీపీ నాయకుల, రౌడీ మూకల కారణంగా ఒంటిమిట్టలో టీడీపీ కార్యకర్తలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అలాంటి సమయంలో టీడీపీ కార్యకర్తలకు ఆదుకోవాల్సిన బాధ్యత తనపై వుందన్నారు. అంతేకానీ తాను రాష్ట్ర మంత్రినని ఆలోచించే ప్రసక్తే లేదన్నారు. పైపెచ్చు తనకు ఒంటిమిట్టలో ఏమి పని అని కూడా వాఖ్యలు చేశారన్నారు. తాను పుట్టింది కడపలోనే అనే సంగతి వారు గుర్తెరగాలన్నారు. రాష్ట్రానికి మంత్రి అయినా ఉమ్మడి జిల్లాలో ఎప్పుడైనా ఎక్కడైనా తిరిగే హక్కు ఉందన్నారు. కాదు కూడదంటూ వైసీపీ నాయకులు చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. వారం రోజులుగా ఒంటిమిట్టలో ఇంటింటికీ తిరిగి కూటమి పాలనలో ప్రజలకు ఏమి చేసింది, ఏమి చేయబోయేది వివరించామన్నారు. ప్రజలు బాగా అర్థం చేసుకున్నారని, వైసీపీ నేతలు ఎన్ని భయభ్రాంతులకు గురిచేసినా బెదరకుండా టీడీపీకే పట్టం కట్టబోతున్నట్లు వెల్లడించారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన మునిసిపల్, జడ్పీటీసీ, పంచాయతీ తదితర అన్ని ఎన్నికలలో ప్రతిపక్షపార్టీని కనీసం నామినేషన్‌లు కూడా వేయించిన పాపాన పోలేదన్నారు. అలాంటిది ఇవాళ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మంటగలిసిందంటూ వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం వింతగా వుందన్నారు. ప్రజాస్వామ్యానికి విలువనిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా ఒంటిమిట్టలో ఓటంటే ఎరుగని దాదాపు 30 గ్రామాల ప్రజలకు మొట్ట మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చేశామన్నారు. వైసీపీ నాయకులు (రవిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అంజాద్‌బాషా) ఒంటిమిట్టలో రౌడీయిజం ప్రదర్శిస్తూ వారి అనుచరులతో దొంగ ఓట్లు వేసేలా రిగ్గింగ్‌కు పాల్పడడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వారి ఆటలు ప్రజల ముందు సాగలేదన్నారు. కనుకనే రెండు జడ్పీటీసీలలో విజయం సాధించి ముఖ్యమంత్రి చంద్రన్నకు కానుకగా అందిస్తామన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో జైలు, జరిమానా



జైలు శిక్ష పడిన నిందితుడితో ఫారెస్టు అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడ్డారన్న నేరం రుజువు కావడంతో మంగళవారం మద్దెల దేవదాసు అనే వ్యక్తికి తిరుపతిలోని ప్రత్యేక న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఫారెస్టు అధికారుల వివరాల మేరకు... ఖాజీపేట మండలంపత్తూరు హరిజనవాడకు చెందిన దేవదాసు 2011లో పత్తూరు సమీపంలో 71 ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడి చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో దేవదాసుకు ఏడాది జైలు శిక్షతోపాటురూ.10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతిలోని రాష్ట్రస్థాయి ఎర్రచందనం స్పెషల్‌కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ప్రొద్దుటూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ టి.రామానాయక్, ఫ్లయింగ్‌స్క్వాడ్ డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ టి.రాజశేఖర్‌బాబు, ప్రొద్దుటూరు ఎఫ్ఆర్‌వో రామానాయక్ తెలిపారు.

భార్యపై భర్త ఫిర్యాదు

దువ్వూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబాకరాపురం గ్రామానికి చెందిన బాదుల్లా అనే వ్యక్తి తన భార్య బీబీపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ భూషణం తెలిపిన వివరాల మేరకు 13 ఏళ్ల క్రితం దొంతిపాడు మండలం బి.కొత్తపల్లెకు చెందిన బీబీతో బాదుల్లాకు వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. సదరు మహిళ ఇంటిలో ఒకటిన్నర లక్ష నగదుతోపాటు రెండు ఉంగరాలను తీసుకుని కనిపించకుండా పోయింది. గతంలో రెండుసార్లు ఇలాగే ప్రవర్తించింది. ఈ మేరకు భర్త బాదుల్లా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు మంగళవారం ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ ఉద్యోగి మృతి



ప్రమాద స్థలంలో రమణయ్య మృతదేహం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె చెంచయ్యగారిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సురసుర రమణయ్య (42) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రమణయ్య ప్రొద్దుటూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా మైదుకూరు-ప్రొద్దుటూరు బైపాస్‌రోడ్డు మొరాయిపల్లె గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలానికి చాపాడు పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కపట్నం గ్రామానికి చెందిన చిన్నబాలయ్య (40) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బాలయ్య తమ్ముడు యేసు వివరాల మేరకు... తాళ్లప్రొద్దుటూరులో పనిచేసే ఓ హోంగార్డు వేధింపులకు తాళలేక జూలై 29న కడప జిల్లా కోర్టు ఎదురుగా పెట్రోలు పోసుకొని తన అన్న బాలయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డడని తెలిపాడు. దీంతో తీవ్రగాయాలు కాగా కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. 14 రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. బాలయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, భార్య ఉన్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కేశవ

చెన్నూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె క్రాస్ రోడ్డు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో కేశవ (40) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఉప్పరపల్లెకు చెందిన కేశవ వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో చెన్నూరుకు వచ్చి తిరిగి గ్రామానికి వెళుతున్నాడు. ఉప్పరపల్లె క్రాస్ రోడ్డు వద్ద మలుపు తిరిగే సమయంలో కడప నుంచి మైదుకూరు వైపు వెళుతున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో కేశవ కాలు విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

ఈశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం



మఠాధిపతికి చెక్కును అందజేస్తున్న రాజలింగ శాస్త్రి కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీ మాత ఆలయ పునర్నిర్మాణానికి విజయవాడకు చెందిన వజ్రాల రాజలింగం శాస్త్రి కుటుంబ సభ్యులు రూ.5లక్షల చెక్కును అందజేసినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అలాగే విజయవాడ వాసి విశ్వకోట మార్కండేయులు కుటుంబ సభ్యులు రూ.లక్షా 116లు, విజయవాడ గవర్నరుపేట బ్రహ్మశ్రీ జవ్వాది కూర్మచార్యులు కుటుంబ సభ్యులు రూ.2లక్షలు అందించారు. అలాగే ధనాలకోట శోభన్‌బాబు కుటుంబ రూ.లక్షా 11వేలు చెక్కు అందజేశారు. క్రిష్ణా జిల్లా పెనమలూరు మండలం రత్నశేఖర్ కుటుంబ సభ్యులు రూ.లక్షా 116లు మఠాధిపతి వీరకుమార స్వామికి చెక్కును అందజేసినట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్



అవగాహన ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్


కడప కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హెచ్‌వీ, ఎయిడ్స్ బారిన పడకుండా యువత అప్రమత్తంగా, అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా వైద్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ, ఏపీ శాక్స్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం పురష్కరించుకొని హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులు, మాదక ద్రవ్యాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సివిల్ జడ్జి మాట్లాడుతూ ప్రతిపల్లెలో హెచ్‌ఐవీ, సుఖవ్యాధులు, కండోమ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. నేటి తరం యువత క్షణికావేశంలో తమ బగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. జిల్లా ఎయిడ్స్ లైప్రసీ కంట్రోల్ అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీ పరీక్షలు ఉచితంగా అందించడంతో పాటు వ్యాధి లక్షణాలు ఉంటే నియంత్రణకు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. టీబీ వ్యాధి గ్రస్తుల జీవన శైలిలో మార్పుల కోసం సేవలందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాధ్, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ నాగరాజు, డాక్టర్ సావిత్రి, ఎన్ఎస్ఎస్ ఆఫీసరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు తప్పనిసరి



ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటర్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్

పోరుమామిళ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా వైద్య, ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్ అన్నారు. మంగళవారం ఆయన పోరుమామిళ్లలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రుల యాజమాన్యాలకు పలు సూచనలు ఇచ్చారు. రోగులకు ఆసుపత్రుల్లో అందించే సేవల ధరల పట్టికను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఫీజులు ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఆపరేషన్ థియేటర్లు, ప్రసవ గదులను పరిశీలించారు. పరిశుభ్రత పాటిస్తున్నారా, సరైన వైద్య సదుపాయాలు ఉన్నాయో లేవా అని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ జయరాం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసరు సాదు వెంకటేశ్వర్లు, కళ్యాణ్ చక్రవర్తి, రమణారెడ్డి పాల్గొన్నారు.





సీతాకోకచిలుకా..

చూడముచ్చటగొల్పే రంగురంగుల సీతాకోకచిలుకలు పువ్వుల్లోని మకరందాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యాలు అలరిస్తున్నాయి. కడప నగరంలోని అలంఖాన్‌పల్లె వేంకటేశ్వరస్వామి ఆలయం, గువ్వలచెరువు ఘాట్ సమీపంలో కనిపిస్తున్న ఈ దృశ్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతి రెక్కలోనూ నలుపు తెలుపు కన్నులు ఉన్నట్లున్న అందమైన సీతాకోకచిలుకలు చేస్తున్న నృత్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కడప



ఘనంగా రాహుకాల పూజలు



అలంకారంలో విజయదుర్గాదేవి, రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

కడప కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించేందుకు రాయలసీమ ప్రాంతం నుంచి పలువురు భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సమస్యలను పరిష్కరించి తీరాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ల, డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడం దారుణమని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప జోనల్ సంయుక్త కార్యదర్శి కోడూరు సుబ్బారావు, డిపో అధ్యక్షుడు తొండలదిన్నె జయరాం ధ్వజమెత్తారు. ఇందుకు నిరసనగా మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రీజనల్ నాయకులు దాస్, కడప డిపో నాయకులు నాగరాజు, సుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎం ఆదేశాలు బేఖాతరు..!

- బస్టాప్ బోర్డులున్న చోట ఆగని బస్సులు
- నడిరోడ్డుపైనే ఆటోలు
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులు

చెన్నూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : హైవేపై వాహనాలు వేగంగా వెళ్లేందుకు త్వరగా గమ్యం చేరేందుకు ఏర్పాటు చేశారు. అయితే ఇదే దారిలో రోడ్డు క్రాసింగ్ ఉన్న చోట బస్టాప్‌లు ఉన్న చోట వాహనాల వేగం తగ్గడంలేదు. అలాగే వాహనాలు బస్టాప్ ఉన్న చోట వాహనాలు నిలబడడంలేదు. దీంతో ప్రజలు ప్రమాదాల పాలవుతున్నారు. చెన్నూరు కొత్తరోడ్డు వద్ద ఇలాంటి ఘటనలు ఇప్పటికే పలుమార్లు జరిగాయి. ఇందుకు ప్రధాన కారణం వాహనాలను బస్టాప్ ఉన్న చోట ఆపకుండా వాటి వెనుక వైపున ఆపడమే ప్రధాన కారణమైంది. గతంలో దాదాపు ఆరేడు నెలల క్రితం కడప ఆర్టీసీ డీఎం చెన్నూరుకు వచ్చి వాహనాలు ఎక్కడ పడితే అక్కడ ఆపకూడదు బస్టాప్ బోర్డుల వద్దనే ఆపాలని పదే పదే చెప్పారు. కానీ ఆ బోర్డులకు వెనుక వైపుగా ఆపడం జరుగుతోంది. ఫలితంగా గ్రామం నుంచి హైవే రోడ్డు ఎక్కి ఇటు మైదుకూరు వైపు, అటు కడప వైపు ఇతర వాహనాల్లో వెళ్లాలనుకునేవారు బస్సులు వెనుక వైపు ఆపడంతో వాటి వెనేక వచ్చే వాహనాలు సరిగా కనిపించక వాటి వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో పలు సంఘటనలు జరిగాయి. ప్రయాణికులు ప్రజలు బస్టాప్‌ల బోర్డు ఏర్పాటు చేసిన చోట ఎందుకు ఆపడంలేదని పలుమార్లు బస్సు డ్రైవర్లు, కండర్లను ప్రశ్నించినా ఫలితం లేదు. అంతేకాక ఈ బస్సులు స్టాప్ బోర్డులు పక్క ఆపకపోవడంతో చెన్నూరు కొత్తరోడ్డు వద్ద ఈ బోర్డులున్న చోట ఆటోలు ఆపుతున్నారు.వాటి వల్ల కూడా రోడ్డు ఎక్కేవారికి ప్రమాదంగా ఉంటుంది. ఆటోలు ఆపే చోట సర్వీసు రోడ్డు కోసం వదిలిన స్థలంలో పలు రకాల దుకాణాలు ముందుకు ఏర్పాటు చేసుకోవడంతో అక్కడ ఆటోలు నిలపుకునేందుకు స్థలం లేక వారు కూడా రోడ్డుపైనే నిల్పున్నారు.



కడప వైపు బస్టాపు వద్ద కాకుండా మరో చోట ఆపిన ఆర్టీసీ బస్సులు

● తీరు మార్చుకోని ఆటో డ్రైవర్లు..: కొత్తరోడ్డుపై ఆటో డ్రైవర్లు తమ ఇష్టం వచ్చినచోట, నచ్చిన చోట నిలబెడుతున్నారు. దీంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడిరోడ్డుపై ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తున్నారు. అంతేగాక రోడ్డుపై నిలిపి పిచ్చాపాటిగా మాట్లాడుకోవడం జరుగుతోంది. ద్విచక్రవాహన దారుడు, పాదచారులు ఎవ్వరైనా కొంచెం పక్కగా ఆటోలు నిలుపు కోండని చెబితే వారిపై ఆటో డ్రైవర్లు వాగ్వాదానికి దిగుతున్నారు. గతంలో కొన్ని రోజులు పోలీసులు ఇక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీక రించి ఆటోలను పక్కన నిలబెట్టేవారు. కానీ ప్రస్తుతం పోలీసులు ఆటోల సంగతే మరిచిపోయినట్లు ఉన్నారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పోలీసులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూస్తాం.



నడిరోడ్డుపై నిలిచి ఉన్న ఆటోలు

● డీఎం చెప్పినా బేఖాతరు..: కడప ఆర్టీసీ డీఎం ఢిల్లీశ్వర్‌రావు చెన్నూరుకు వచ్చి కొత్త రోడ్డులో పలువురు డ్రైవర్లకు సూచనలు ఇస్తూ బస్సులు ఇక్కడ కాదు. బోర్డులు ఉన్న చోట ఆపాలని చెప్పారు. కానీ ఆయన మాటలు బేఖాతరు అయ్యాయి. మొత్తమ్మీద ఆర్టీసీ డ్రైవర్లు బస్టాప్ బోర్డులున్న చోట వాహనాలు ఆపేవిధంగా ఎప్పుడు మారుతారో ఏమోనని ప్రజలు ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది.

ఎన్నిమార్లు చెప్పినా అంతే



ఆర్టీసీ డ్రైవర్లకు పై అధికారులు చెప్పినా వినడంలేదు. సామాన్య ప్రజలు చెబితే వింటారా, డ్రైవర్లు ప్రజల ప్రాణాలు రక్షించాలి కానీ వారి నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలకు చేటుగా మారుతుంది. వారి తీరు మారనంత వరకు హైవే ఎక్కి మలుపు తిరిగేంత వరకు బిక్కుబిక్కుమంటూ ప్రజలు భయపడి వెళుతున్నారు.

- నీలం గోవిందరెడ్డి, చెన్నూరు

డ్రైవర్లకు సూచనలిస్తాం

ఆర్టీసీ డ్రైవర్లకు తగిన సూచనలు ఇస్తాం. ప్రమాదాలు కాకుండా చూస్తాం. గతంలో చెన్నూరు వద్ద డ్రైవర్లు బస్సులు ఆపి బస్సు స్టాపుల వద్ద బస్సులు నిలపాలని సూచనలు చేశాం. అయినా డ్రైవర్లు పక్కన ఆపితే ఎలా, ఇలాంటి పరిస్థితులు ముందు ముందు లేకుండా మరోమారు డ్రైవర్లకు చెబుతాం.

● ఢిల్లీశ్వర్‌రావు, డిపో మేనేజరు ,కడప.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషిచేయండి

కడప కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బుచ్చి రాంప్రసాద్‌ను మంగళవారం కడపకు చెందిన పలువురు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు విజయవాడలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, పిడతల గోపాలకృష్ణశర్మ, వారణాశి శ్రీధర్‌శర్మ, మాట్లాడుతూ బ్రాహ్మణులసంక్షేమానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జగదీష్‌స్వామి,నరసింహబట్టర్ తదితురులు పాల్గొన్నారు.

వారంలో కొత్త ఎస్ఐని నియమిస్తాం

లింగాల,ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లింగాల పోలీస్‌స్టేషన్‌కు వారం రోజుల్లో కొత్త ఎస్ఐని నియమిస్తామని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. పులివెందుల మండలం జడ్పీటీసీ ఎన్నిక సందర్భంగా ఇ.కొత్తపల్లె పోలింగ్ బూత్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు నెలల నుంచి లింగాల పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐ లేకపోవడంతో మండలంలో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని విలేకరులు ఆయన దృష్టికి తెచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ మరో వారం రోజుల్లో లింగాల పోలీస్‌స్టేషన్‌కు కొత్త ఎస్ఐని నియమిస్తామని పేర్కొన్నారు.

కులుకు భజన పుల్లయ్య మృతి తీరని లోటు

కడప కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చెక్కభజన, కులుకు భజన, జడకోపు, కోలాటాల్లో నిపుణుడు పుల్లయ్య మరణం తీరని లోటని యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఇటీవల మరణించిన చెక్కభజన కళాకారుడు పుల్లయ్యకు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో పుల్లయ్య చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి. పార్వతి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన వేడుకలు

కమలాపురం రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సెట్ప్ ముఖ్య కార్యనిర్వాహణా ధికారి సాయిగ్రేస్, డాక్టర్‌గుణశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. ట్రస్టు చైర్మన్ జూటూరు విజయకుమార్, కళాశాల అధ్యాపకుడు వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసరు మధు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో సాగిన ఎన్నికను అపహాస్యం చేస్తారా..? : ఎమ్మెల్సీ

పులివెందుల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా సాగినా అపహాస్యంచేస్తారా అని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని అరెస్టు చేసి విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వేచ్ఛా యుత వాతావరణంలో పులివెందుల ప్రజలు వారి ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఇలాంటి వాతావరణంలో ఎన్నికలు సాగితే వైసీపీ నాయకులు దీనిని అపహాస్యం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వానికి ఎన్నికలకు ఎటువంటి సంబంధంలేదన్నారు. కేవలం ఎన్నికల కమిషన్ పరిధిలో సాగుతాయన్నారు. పులివెందులలో ఇలాంటి ఎన్నికలు జరగడం వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.

విస్తృత ప్రచారం కల్పించాలి : డీఎంహెచ్ఓ

పులివెందుల రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలతో కలిగే దుష్పరిణామాలు, హెచ్ఐవీకి అడ్డుకట్ట వేసేందుకు విస్తృత ప్రచారం కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మంగళవారం హెచ్ఐవీ, మాదక ద్రవ్యాల నివారణ కోసం చేపట్టబోతున్న మాసోత్సవాల కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌తో కలిసి డీఎంహెచ్ఓ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ నవీన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొయిద్దీన్, డాక్టర్లు సౌజన్య,శ్రీనివాస్, ఐసీటీసీ, ఎస్‌టిడీ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్ వల్లి, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీతో మిలాఖత్



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

కడప కలెక్టరేట్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీతో మిలాఖత్ అయిందని వీసీసీ నేత సత్తార్, మైనార్టీ నగర అధ్యక్షుడు ఆసీఫ్ ఖాన్ విమర్శించారు. మంగళవారం లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈవీఎంల్లో జరిగిన అవకతవకలను ప్రశ్నించినందుకు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ కార్యాలయం బయట నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర నాయకులు కోటపాటి లక్ష్మయ్య, జాకీర్, అన్వర్, మామిళ్ల బాబు, చాన్‌బాష పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

కడప క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈగల్ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఈగల్ ఆధ్వర్యంలో శంకరాపురం విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి సమీపాల్లో కానీ, కళాశాల సమీపాల్లో కానీ ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం జరుగుతుంటే తమకు సమాచారం అందించాలన్నారు. టోల్ ఫ్రీ నెం.1972కు ఫోను చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దివ్యదాస్, లెక్చరర్లు, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కమలాపురం రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తుంటామని ఏఐఎస్ఎఫ్ కమలాపురం ఏరియా కార్యదర్శి కోగటం షేక్ షరీఫ్ తెలిపారు. మంగళవారం కమలాపురం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ వ్యవస్థాపక వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా కార్యదర్శి నాగేశ్వర్‌రావు హాజరై జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ మండల అధ్యక్షుడు రాఘవ, ఉపాధ్యక్షులు మణికంఠరెడ్డి, ఏరియా కార్యదర్శి రబ్బాని, అంజిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్..: విద్యార్థి హక్కులను కాలరాస్తున్న జీఓలను రద్దుచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. విద్యారంగంలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మంగళవారం కడప నగరం ఆర్ట్స్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిఖిత, అభీరనందన్, అశోక్, వెంకటరెడ్డి, వీరు,చిన్నితదితరులు పాల్గొన్నారు.

మూడు వరాల ఉత్తర్వులు అమలు చేయాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం రోజున ఆశా కార్యకర్తలకు చంద్రబాబు ప్రకటించిన మూడు వరాలకు ఉత్తర్వులు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో పుస్తకాల వర్గీకరణకు సీసీ (కోలోస్ క్లాసిఫికేషన్) ప్రక్రియను తీసుకొచ్చిన గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ అని సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ జి.పార్వతి పేర్కొన్నారు. మంగళవారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా గ్రంథపాలకుల దినోత్సవాన్ని నిర్వహించింది. సంచాలకులు, సిబ్బంది కలిసి ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు.

పెన్నాలో వరద నీటి ప్రవాహం



చెన్నూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు వద్ద పెన్నానదిలో వరద నీటి ప్రవాహం కొనసాగు తోంది. నీటి ప్రవాహం వేగవంతంగా ఉండడంతో నదిలోకి ఎవరూ దిగవద్దని తహసీల్దారు సరస్వతి, సీఐ క్రిష్ణారెడ్డి హెచ్చరించారు. అలాగే ఈ రెండు ప్రాంతాల్లో రెవెన్యూ , పోలీసుసిబ్బందిని పంపించి నదిలోకి ఎవరూ దిగకుండా చూస్తున్నట్లు తెలిపారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

పులివెందుల రూరల్/వేముల,ఆగస్టు 12: తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు సూచించారు. మంగళవారం పులివెందులలోని జయమ్మకాలనీలోని అంగన్వాడీ కేంద్రం, వేముల హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొద్దీన్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, డాక్టర్ శాంతకుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు..: నులి పురుగుల నివారణతో పిల్లలకు మరింత ఆరోగ్యం పెరుగుతుందని రాష్ట్ర పర్యవేక్షణాధికారి జోనల్ మలేరియా ఆఫీసరు డాక్టర్ జమాల్‌బాష అన్నారు. చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అలాగే ఆది ఆంధ్రపాఠశాలలో ఎంఈఓ గంగిరెడ్డి, వైద్యాధికారి వినయకుమార్‌రెడ్డి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకట ప్రసాద్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వల్లూరు..: మండల పరిధిలోని ఆదర్శపాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని జిల్లా వైద్యాధికారి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు అందించారు. జోనల్ మలేరియా ఆఫీసరుడాక్టర్ జమాల్‌బాషా, డాక్టర్ రమేష్, స్థానిక డాక్టరు ఫణీంద్ర, మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ బాబు, ప్రోగ్రాం మేనేజర్లు నవీన్‌కుమార్, వెంకటరమణ సిబ్బంది ,విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పులివెందులలో చిన్నారికి మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో

పెండ్లిమర్రి..: నులి పురుగుల వ్యాధి రాకుండా ఉండాలంటే పరిశుభ్రత పాటించాలని నందిమండలం పీహెచ్‌సీ వైద్యుడు చెన్నారెడ్డి తెలిపారు.జాతీయ నులిపురుగు నివారణ దినం సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. హెచ్ఎం విజయకుమార్,ఉపాధ్యాయులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు ఎంతో ముఖ్యం



సీకేదిన్నె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలు ఎంతో ముఖ్యమని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనుపామానందజీ మహరాజ్ తెలిపారు. స్థానిక రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాసంపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వామిజీ మాట్లాడుతూ విద్య అనేది కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితం కాకూడదని వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండ్ఎస్ విభాగాధిపతి శశికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరకప్రాయంగా గుంతపల్లె రోడ్డు

●కంపచెట్లతో మూసుకుపోయిన రహదారిపై పడిన గుంతలు● ఇబ్బందులెదుర్కొంటున్న 8గ్రామాల ప్రజలు ● పట్టించుకోని అధికారులు

బి.కోడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన బి.కోడూరుకు కూతవేటు దూరంలో ఉన్న గుంతపల్లె రహదారి నరకప్రాయంగా మారింది. నిత్యం ఎనిమిది గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వివిధ రకాల పనుల కోసం ఈ రహదారిపైన తిరుగుతూ ఉంటారు. అయితే మండల కేంద్రానికి కూతవేటు దూరంలో గుంతపల్లె గ్రామానికి చెందిన చెరువు కట్ట ఉంది. కాగా దంతెలపల్లె, ఐత్రంపేట, అయ్యవారిపల్లె, శిరిగిరిపల్లె, గోవిందాయపల్లె , విజయనగరకాలనీ, వడ్డెవారిపల్లె అమ్మవారిపేట గ్రామాలకు చెందిన ప్రజలు గుంతపల్లె చెరువు కట్టపైన గల రహదారి గుండా మండల కేంద్రానికి నిత్యం వివిధ పనులపై అధికారుల వద్దకు వస్తుంటారు. అయితే ఆ చెరువు కట్టపై ఉన్న రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి పూర్తిగా మూసుకుపోయింది, అంతేకాక ఆ రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు సైతం నడవడానికి వీలులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతోంబైకులపై వెళ్లేవారు పెద్దపెద్ద గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉండడంతో వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అధికారులు నిత్యం ఆ రహదారిపైనే వెళతున్నా ఈ రహదారిని చూసీ చూడనట్లు ఉంటున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా చెరువు కట్టపై ఉన్న రహదారి గుంతలను పూడ్చి కంపచెట్లను తొలగించి సౌకర్యవంతంగా చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.


గుంతల రోడ్డుకు ఇరువైపులా కప్పేసిన కంపచెట్లు

ఇరిగేషన్ డీఈ ఏమన్నారంటే:ఈ విషయమై ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా చెరువుకట్టపై ఉన్న రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఉన్నాయనేది వాస్తవమేనన్నారు. అయితే మున్నెల్లి నీటి సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డికి విషయం తెలిపానని ఆయన రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించి గుంతలను పూడ్చుతామని చెప్పారని వివరించారు.

మున్సిపల్ అద్దె గదులకు లీజు వేలం

ప్రొద్దుటూరు , ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గల మున్సిపల్ వాణిజ్య సముదాయాల్లోని ఖాళీగా వున్న 35 అద్దె గదులకు వేలం పాటలు జరిగాయి. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో రెవెన్యూ అధికారి డేనియల్ జోసఫ్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. టీబీ కాంప్లెక్స్‌లోని 23 , వసంతపేట కాంప్లెక్స్-9, ఎస్‌బీఐ కాంప్లెక్స్‌లో- 2, పాత మార్కెట్‌లో -1 ఖాళీగా ఉన్నవాటికి వేలం నిర్వహించగా కేవలం వసంతపేట కాంప్లెక్స్‌లో 9 గదులకు గాను షాప్ నెం-1,2 గదులకు మాత్రమే లీజుకు వేలం పాటలు జరిగాయి. ఇందులో షాప్‌నెం-1 ని మహమూబ్ బాషా రూ.8500 లకు షాప్‌నెం-2 ఎం ఏసురత్నం రూ. 5300 కు లీజు దక్కించుకున్నాడు. ఎస్‌బీఐ కాంప్లెక్స్‌లో రెండింటికి గాను కేవలం షాప్‌నెంబరు -3 కు వేలం జరుగగా ఆర్ సురేష్ బాబు రూ.9500 లకు లీజు దక్కించుకున్నాడు. పాతమార్కెట్‌లోని ఖాళీగా వున్న ఒక్క రూముకు షాప్‌నెం- 6కు కె గణేష్ రామేశ్వర్ రూ.12000 లీజు దక్కించుకున్నాడు. ఈ వేలం పాటల్లో ఆర్‌ఐ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర పాలక మండలి నియామకానికి గ్రీన్‌సిగ్నల్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయం నూతన పాలక మండలి నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈవో జె.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 27వ తేదీలోపు తమ దరఖాస్తులను కడప దేవదాయశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేటి నుంచి ఆధార్ కేంద్రం పునరుద్ధరణ

ముద్దనూరు ఆగస్టు12(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు-1 సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పునరుద్ధరించినట్లు ఎంపీడీవో అరుంధతి తెలిపారు.గత కొన్ని రోజులుగా కొన్ని కారణాల వల్ల ఆధార్ నమోదు నిలిపి వేసి బుధవారం నుంచి పునర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ అమ్మవారి రథోత్సవం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కాలజ్ఞాన కర్త శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థాన పరిధిలోని కనుమ పోలేరమ్మ అమ్మవారి రథోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రకాశం జిల్లా కనిగిరి వాస్తవ్యులు బ్రహ్మయ్య ఆయన సతీమణి కవిత కుటుంబ సభ్యులు రథోత్సవాన్ని చేపట్టారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వసంతపేటలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి 354వ ఆరాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం వేకువజామున స్వామి వారి బృందావనానికి, గోపాలకృష్ణునికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రదక్షిణ నిర్వహించారు. స్వామివారి బృందావనంను వెండి కవచాలు, రంగు రంగుల పూలు, తులసీమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారి రథోత్సవం పురవీధుల్లో నిర్వహించారు. రాత్రి స్వామివారికి పల్లకీసేవ, మంగళహారతులు నిర్వహించి భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

కిసాన్ నిధులు పడకుంటే ఆర్‌ఎస్‌కేలకు వెళ్లండి

మైదుకూరు రూరల్, ఆగస్ట 12(ఆంధ్రజ్యోతి) :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పీఎం కిసాన్ పథకం డబ్బులు అకౌంట్‌లో పడని రైతులు దగ్గరలోని వ్యవసాయ కార్యాలయంలో లేదా మీ గ్రామాల్లోని రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలని మండల వ్యవసాయశాఖ అధికారి బాల గంగాధర్‌రెడ్డి తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని బండివారిపల్లె,తిమ్మాయపల్లె గ్రామాలలో వ్యవసాయశాఖ అధికారులు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరించారు.

విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలి

కాశినాయన ఆగష12 (ఆంధ్రజ్యోతి) విద్యార్థినులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి(జీసీడీవో) డి.రూతు పేర్కొన్నారు. మంగళవారం ఆమె వరికుంట్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థినులతో మాట్లాడి అక్కడ వారికి అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మెర్సీరాణి, పీహెచ్‌ఎస్ శారద పాల్గొన్నారు.

గ్యాస్ ఆటో బోల్తా - డ్రైవర్‌కు గాయాలు

జమ్మలమడుగు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టోల్‌గేటు సమీపాన మంగళవారం గ్యాస్ సిలిండర్ల ఆటో బోల్తాపడిన ప్రమాదంలో డ్రైవర్ శివారెడ్డికి గాయాలయ్యాయి. ఈయన మైలవరం మండలం వేపరాల ఇండియన్ గ్యాస్ వద్ద నుంచి ముద్దనూరుకు ఆటోలో గ్యాస్ సిలిండర్లతో వెళ్లి వస్తుండగా ఆటో టైరు ఊడిపోయి బోల్తాపడింది. డ్రైవర్‌కు కాలు, చెయ్యి తీవ్ర గాయమైంది. వెంటనే అతన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు.

పులివెందుల ఓటర్లకు స్వాతంత్ర్యం వచ్చింది

జమ్మలమడుగు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఓటర్లకు మంగళవారం జరిగిన పోలింగ్‌తో 40 సంవత్సరాలుగా ఉన్న ఇబ్బందులు తొలగిపోయి స్వాతంత్ర్యం వచ్చిందని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బిరు సంతోష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన జమ్మలమడుగులో విలేకరులతో మాట్లాడారు. 1984లో పులివెందుల మండల ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేశారన్నారు. ఆ తర్వాత నుంచి దాదాపు 40 సంవత్సరాలుగా వారికి స్వాతంత్ర్యం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వలన జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి పోటీ చేయడం ఆ ప్రాంత వాసులకు పోలింగ్ ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసుకోవడానికి స్వాతంత్ర్యం లభించినట్లుగా ఆయన తెలిపారు.

ఆంజన్నకు పూజలు

పోరుమామిళ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అంజేనేయస్వామి గుడిలో స్వామివారికి ప్రత్యేక ఆకుపూజ నిర్వవిహించారు. మంగళవారం రాత్రి భక్తులు విరివిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


జమ్మలమడుగులో పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

జమ్మలమడుగు/మైలవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడి వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. మంగళవారం జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడీఏ ఎల్.అనిత, వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. కాగా మైలవరం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జేడీఏ చంద్రానాయక్ మాట్లాడుతూ ప్రతి రైతు విత్తనాలు సాగు చేసేటప్పుడు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఉచితంగా కందిరకం చిరుసంచులు రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత, ఏవో గురుమోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్, వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరులో:రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అశోక్‌రెడ్డి అన్నారు. మండల పరిధి రాఘవాపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు తప్పని సరిగా చేసుకోవాలని తెలిపారు.అనంతరం రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, ఆత్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్షుల నియామకం


సున్నపురాళ్ల పల్లె అధ్యక్షుడు మల్లుగోపాల్‌రెడ్డి


తిప్పలూరు అధ్యక్షుడు బంగారుమునిరెడ్డి

ఎర్రగుంట్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరు, సున్నపురాళ్లపల్లె సింగిల్ విండో అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. తిప్పలురు పీఏసీఎస్ అధ్యక్షుడుగా ఇల్లూరు మాజీ సర్పంచి ఎం.బంగారు మునిరెడ్డిని నియమించారు. అలాగే సభ్యులుగా హనుమనగుత్తికి చెందిన చెమికల రామ్మోహన్‌రెడ్డి, వెంకటాపురంకు చెందిన మోపూరి మహేశ్వరరెడ్డిని నియమించారు. కాగా సున్నపురాళ్లపల్లె పీఏసీఎస్ అధ్యక్షుడుగా మాజీ మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మన్ మల్లుగోపాల్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే సభ్యులుగా కొప్పల సుధీర్‌కుమార్, పవన్‌కుమార్‌రెడ్డిని నియమించారు. తమను సొసైటీ అధ్యక్షులుగా, సభ్యులుగా నియమించేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డికి, మండల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఎంఎన్‌యు నాయకులు

బద్వేలు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిపో వర్కింగ్ ప్రెసిడెంటు జనార్ధనరావు, ప్రెసిడెంటు చంద్రారెడ్డిలు డిమాండ్ చేశారు. ఎన్‌ఎంయూ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు నరసింహారెడ్డి, శివరామిరెడ్డిలు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జనార్ధనరావు మాట్లాడుతూ వేతన సవరణ జరిగి రెండు సంవత్సరాలు పూర్తయినందున వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. 8వేల పోస్టులను డైరెక్టు రిక్రూట్‌మెంటు ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి చంద్రయ్య, గ్యారేజీ కార్యదర్శినాగేంద్ర, జాయింటు సెక్రటరీ శ్రీధర్, డిపో నాయకులు ఎంఎస్‌నాయుడు, కె.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో:ఆర్‌టీసీ కార్మికుల పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో ప్రెసిడెంట్ నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టీసీ డిపో వద్ద మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, పురుషోత్తం , ఎస్‌ఎస్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు

జమ్మలమడుగులో: జమ్మలమడుగు ఆర్టీసీ గ్యారేజీ వద్ద మంగళవారం నేషనల్ మజ్దూర్‌యూనియన్ అధ్యక్షుడు బ్రహ్మం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిటీ మెంబర్ ఎస్ఎం వలి, రీజినల్ కమిటీ మెంబర్ మోహన్‌రెడ్డి, వాసు, డిపో కార్యదర్శి శివుడు, కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులకు నష్టం

పోరుమామిళ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు రోడ్డుపాలు పడతారని ఏఐటీయూసీ మండల కార్యదర్శి రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆటో కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక చదువుకుని ఖాళీగా ఉండలేక కుటుంబాన్ని పోషించేందుకు ఆటోలపై జీవనం సాగిస్తున్న వారికి ఇది తీరని ఆవేదన మిగిల్చిందన్నారు. ఆటో కార్మికుల కుటుంబానికి రూ.25వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించాలన్నారు. అనంతరం ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

మెరుగైన సమాజం కోసం యువత నడుంబిగించాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) :మెరుగైన సమాజం కోసం యువత ముందుకు రావాలని రిటైర్డ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మార్కారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివేకానందఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినత్సోవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం 200 మంది విద్యార్థులకు యువత మేలుకో నేస్తమా పుస్తకాలను అందించారు.

రోడ్లపై వర్షపు నీరు నిలబడకుండా చూడండి


వర్షపు నీళ్లు నిలిచివుండటాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, ఏసీ తదితరులు

ప్రొద్దుటూరు , ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి) : వర్షం వస్తే రోటరీ కంటి ఆసుపత్రి వీధిలో రోడ్డుపై నీరు నిలిచి ఆసుపత్రికి వచ్చే రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోటరీ క్లబ్ కమిటీ పెద్దలు ప్రభు, బాలు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రా రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం కమిషనర్ రవిచంద్రారెడ్డి అసిస్టెంట్ కమీషనర్ కొండయ్యలు రోటరీ క్లబ్ వద్ద ఉన్న పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే బాలాజీ నగర్‌లో పర్యటించిన కమిషనర్‌కు స్థానిక మహిళలు పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. చెత్తవేసే పాయింట్‌లో డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని లేకుంటే ఆవులు పందులు అపరిశుభ్రం చేస్తున్నాయని తెలిపారు. కాగా కోనేటి కాల్వ వీధిలోని అర్చన థియేటర్ వద్ద ప్రొద్దుటూరు చానల్‌లో పేరుకున్న వ్యర్థాలను తొలగించే పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా పాల్గొన్నారు.

నులిపురుగుల వలన అనారోగ్య సమస్యలు


విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌వో

ప్రొద్దుటూరు , ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల వలన పిల్లలు పెద్దల్లో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమౌతాయని వాటి నిర్మూలనకు తప్పనిసరిగా మందులువాడాలని డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ గీత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రామేశ్వరం మున్సిపల్ హైస్కూల్లో జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సులో డాక్టర్ గీత మాట్లాడుతూ నులిపురుగుల వలన రక్తహీనత , పోషకాల లోపం లాంటి లక్షణాలు కనపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ అల్బెండజోల్ మందులు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ హిమబిందు, హెడ్మాస్టర్ సత్యబాబు, డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, శోభారాణి, సివో సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో రక్తహీనత నివారణ


విద్యార్థినులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం వలన రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించవచ్చని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి, పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఖాజీపేటలో: ప్రతి ఒక్కరు పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకుంటే నులిపురుగులను నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి మనోరమ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలో కేజీబీవీ, జిల్లా పరిషత్, అంగన్వాడీ కేంద్రాలు, కాలేజీలు, ఎలిమెంటరీ స్కూళ్లలో 11,651 మందికిగాను 11,267 మందికి ఆల్‌బెండజోల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ముబీన్, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సబ్‌యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ భార్గవి, ఆశా నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరులో: నులిపురుగులను నివారించాలని ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని వైద్యులు సురేష్‌బాబు, రోషిని, హేమలత అన్నారు. దువ్వూరు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అల్‌బెండజోల్ అనే మాత్రలను విద్యార్థులకు మంగళవారం అందజేశారు. విద్యార్థుల్లో రక్తహీనత, నీరసంగా ఉండడం, తలతిరగడం, కడుపునొప్పి లాంటి లక్షణాలు నులిపురుగు కడుపులో ఉండడం వలన వస్తాయన్నారు. మండల పరిధిలో 9,525 మంది విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు అందించాల్సి ఉండగా 9,319 మందికి అందించినట్లు ఆరోగ్య విస్తరణాధికారి రాజగోపాల్ తెలిపారు.

బద్వేలు రూరల్‌లో : ఒక మాత్రతోనే నులి పురుగు నివారించవచ్చని తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్‌కుమార్ అన్నారు. నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలపరిధిలోని తిరువెంగలాపురం ఉన్నత పాఠశాలలో అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు వినయకుమార్, సౌమ్య, ఎంఈవో డాక్టర్ ప్రమీల, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

కొండాపురంలో: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఆసుపత్రి సిబ్బంది అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక గురుకుల పాఠశాలలో కొండాపురం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మేరి, సీహెచ్‌వో లత, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ మాధవి ,అలివేలు తదితరులు పాల్గొన్నారు.

చాపాడులో: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 6,519 మంది విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేసినట్లు డాక్టర్లు శ్రీవాణి, కావ్యమాధురి పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ మాత్రలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఏడాదిలో రెండుమార్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఓబులేసు, శివప్రసాద్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సీహెచ్‌వో మహదేవ్‌యాదవ్, సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

బి.కోడూరులో: మండల పరిధిలోని బి.కోడూరు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయకిరణ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. మండలం మొత్తం మీద 2385 మంది విద్యార్థులు ఉండగా 97 శాతం మందికి మాత్రలు మింగించడం జరిగిందని మిగతా వారికి కూడా 20వతేదీన మాత్రలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, హెల్త్ సూపర్‌వైజరు జాన్‌విలియం, పుష్పాలంజలిప ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, వైద్యసిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మదన్ మృతి పట్ల మైసూరా సంతాపం


మదన్‌మోహన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మైసూరా

ఎర్రగుంట్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజంపేట మాజీ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రెడ్డి మృతి పట్ల మాజీ హోం మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. మంగళవారం హైద రాబాదులో మదన్‌మోహన్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. మదన్ తనకు మంచి మిత్రుడని, ఆయన మృతి తీరని లోటన్నారు. ఎమ్మెల్యేగా కలిసి పనిచేశామన్నారు. రాయలసీమ పాదయాత్రతోపాటు, అనేక ఉద్యమాల్లో తనకు తోడుగా ఉన్నాడన్నారు. తన అభిప్రాయాలు నిర్మోటంగా తెలిపేవాడని, నిబద్ధతగా ఉండేవాడన్నారు.

పోరుమామిళ్లలో: రాజంపేట మాజీ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రెడ్డి మృతికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత శివరామనంద సరస్వతి సంతాపం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన రుషికేష్‌లోని దయానంద ఆశ్రమంలో ఉంటున్నారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రెడ్డి మృతి చెందిన వార్త తెలియడంతో ఆయన తన సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా ఆయన రుషికేశ్ నుంచి ఫోను ద్వారా పోరుమామిళ్లలోని పాత్రికేయులతో మాట్లాడుతూ తాను, మదన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌లో పనిచేశామన్నారు. ఆయన మరణం రాజంపేట ప్రజలకు తీరని లోటు అన్నారు.

ఆకలి, అస్పృశ్యత, ఆత్మగౌరవం పైనే పోరాటం

ప్రొద్దుటూరు , ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆకలి, అస్పృశ్యత ఆత్మగౌరవం పైనే దళిత సమాఖ్య పోరాటమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లె ఎల్లయ్య మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం దళిత సమాఖ్య కార్యాలయంలో జిల్లా సమావేశంలో ఎల్లయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల ఉపప్రణాళిక నిధులు దారి మళ్లించ కుండా వారి సంక్షేమం అభివృద్ధి కోసం వినియోగించాలన్నారు. .అనంతరం జిల్లా సహాయ కార్యదర్శిగా తోట ఓబులేసును, ప్రొద్దుటూరు మండల కన్వీనర్‌గా పల్లవోలు సుమన్, జమ్మలమడుగు మండల కన్వీనర్ గా దిబ్బగాళ్ల సుదర్శన్, దళిత బహుజన సమాఖ్యకన్వీనర్‌గా శివశంకర్‌ను ఎన్నికైనట్లు ఎల్లయ్య తెలిపారు.